2 నుంచి చెన్నైలో బతుకమ్మ సంబరాలు


బీజేపీ జిల్లా కార్యదర్శి వీరన్నకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న నాయకులు

లాలాపేట: చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి 10 వరకు తలపెట్టిన బతుకమ్మ సంబరాలకు హాజరు కావాలని నిర్వాహకులు కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌, మహంకాళి జిల్లా బీజేపీ కార్యదర్శి మల్లికంటి వీరన్నను ఆదివారం తార్నాకలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 11 ఏళ్లుగా బతుకమ్మ సంబరాలు నిర్వహిస్తున్నామని, ఈయేడు చెన్నైలోని కన్యకాపరమేశ్వరీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో వేడుకలు ప్రారంభమై సద్దుల బతుకమ్మతో ముగుస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు అంజయ్య, పర్శరాములు, శ్రీనివాస్‌, షఫీ, నర్సింహ, అశోక్‌, గిరి, రామ్మూర్తి, తమిళనాడు కుమ్మర సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. రమేశ్‌ తదితరులు ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన


సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ


సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకుడు రవిప్రసాద్‌గౌడ్‌

సికింద్రాబాద్‌: బీజేపీ సభ్యత్వ నమోదుకు అనూహ్య స్పందన వస్తున్నదని మహబూబ్‌నగర్‌ ఎంపీ డీకే అరుణ అన్నారు. మధురానగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద మహిళా నాయకురాలు మేకల కీర్తి హర్షకిరణ్‌ నేతృత్వంలో ఆదివారం సభ్యత్వ నమోదు చేపట్టగా ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైనార్టీలు, మహిళలు, యువత, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు పారిశ్రామిక వేత్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యత్వం తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు. దేశంలో సుపరిపాలన కావాలని, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి బాటలో పయనిస్తున్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి వందే వరుణ్‌, మాజీ కార్పొరేటర్‌ మేకల సుజాత, నాయకులు కనకట్ల హరి, అంబాల రాజేశ్వరరావు, ఆకారం రమేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వంలో బీజేపీదే మొదటి స్థానం..

బౌద్ధనగర్‌: ప్రపంచంలోని రాజకీయ పార్టీల్లో అత్యంత ఎక్కువ సభ్యత్వం ఉన్న పార్టీగా బీజేపీ మొదటి స్థానంలో ఉందని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్‌గౌడ్‌ అన్నారు. బౌద్ధనగర్‌ డివిజన్‌లోని పలువురు వ్యాపారులకు ఆదివారం ఆన్‌లైన్‌ ద్వారా పార్టీ సభ్యత్వం అందించారు. ప్రస్తుతం డివిజన్‌లో 4500 మందికి సభ్యత్వం ఉందని ఈసారి మరో 10 వేల మందికి అందించేలా బూత్‌కమిటీ సభ్యులు, సీనియర్‌ నాయకులతో కలిసి పని చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో దత్తు, నేతి సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ అజయ్‌, చిలకల సురేశ్‌, వేణుగోపాల్‌, ఎంపీ లక్ష్మణ్‌, భైరి సురేశ్‌, గజరాజుపాల్‌, పవన్‌ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్‌: సనత్‌నగర్‌ డివిజన్‌ బూత్‌ నెంబర్‌–172లో బీజేపీ నేతలు ఆదివారం ఇంటింటికీ తిరుగుతూ సభ్యత్వ నమోదు చేపట్టారు. రాష్ట్ర నాయకుడు లింగంపల్లి నర్సింగరావు, బాల నరసింహ తదితరులు హాజరై మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ పాలనకు ప్రజలంతా ఆకర్షితులై స్వచ్ఛందంగా సభ్యత్వం తీసుకునేందుకు ముందుకువస్తున్నారన్నారు. తెలంగాణలో సైతం పార్టీ విజయం సాధించేలా కార్యకర్తలు సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల మహేశ్‌, రమేశ్‌గౌడ్‌, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


గజ్జెల రాజారాం చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌

పద్మారావునగర్‌: బన్సీలాల్‌పేట్‌ డివిజన్‌ బీఆర్‌ఎస్‌ ఎస్సీ సెల్‌ అధ్యక్షుడు గజ్జెల శ్రీనివాస్‌ కుటుంబాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ ఆదివారం పరామర్శించారు. శ్రీనివాస్‌ సోదరుడు రాజారాం ఇటీవల మరణించారు. ఆదివారం ఐడీహెచ్‌ కాలనీలో దశదినకర్మ నిర్వహించారు. ఎమ్మెల్యే హాజరై రాజారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గజ్జెల శ్రీనివాస్‌, లింగం, స్వామి, రవి, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే జాతీయ టెన్నిస్‌లో సిల్వర్‌ మెడల్‌



బన్సీలాల్‌పేట్‌: ఆలిండియా 70వ రైల్వే టెన్నిస్‌ పోటీల్లో మోండా మార్కెట్‌ డివిజన్‌ బండిమేట్‌కు చెందిన పొన్నాల సిద్దార్థ సిల్వర్‌ మెడల్‌ సాధించారు. చెన్నైలో ఈ నెల 17 నుంచి 21 వరకు జరిగిన పోటీల్లో దేశంలోని పలు రైల్వే విభాగాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ప్రముఖ సంఘ సేవకుడు, నాయకులు పొన్నాల సాయికుమార్‌ కుమారుడైన సిద్దార్థ రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగిన పలు టెన్నిస్‌ పోటీల్లో పలుమార్లు పతకాలు సాధించారు. సిద్దార్థను ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌, టీ పద్మారావు, కార్పొరేటర్‌ కొంతం దీపికా నరేశ్‌ అభినందించారు.

మర్యాదపూర్వక కలయిక


అశోక్‌యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కోదండరాం

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ కొమ్ము అశోక్‌ యాదవ్‌ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్‌ కోదండరాంను తార్నాకలోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల అశోక్‌ యాదవ్‌ సామాజిక సేవా రంగంలో ఇంటర్నేషనల్‌ పీస్‌ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్‌ను అందుకోవడంతో ఎమ్మెల్సీ ఆయనను శాలువాతో సత్కరించారు. గొర్రెల, మేకల వృత్తిదారుల సంఘానికి నాయకత్వం వహిస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహేశ్‌, గోపాల్‌, రాజేశ్‌, నర్సింహ తదితరులు ఉన్నారు.

ఓయూ కామర్స్‌లో డాక్టరేట్‌



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్‌ డిపార్ట్‌మెంట్‌ నుంచి శనిగరపు విజయ్‌ పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్‌ను అందుకున్నారు. అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డా.కే శ్రీనివాస్‌, ఐపీఈ డైరెక్టర్‌ శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో 'ఫైనాన్షియల్‌ ఇంక్లూజన్‌ ఎమాంగ్‌ ఎంఎస్‌ఎంఈస్‌ ఇన్‌ తెలంగాణ ఏ సెలెక్ట్‌ స్టడీ ఆఫ్‌ ఎస్టైల్‌ నల్గొండ డిస్ట్రిక్‌' అనే అంశంపై సమగ్రమైన పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. కాగా విజయ్‌ ఇటీవల గురుకుల విద్యా సంస్థల్లో కామర్స్‌లో జేఎల్‌గా ఉద్యోగం సంపాధించాడు. ప్రస్తుతం నిజామాబాద్‌ జిల్లాలోని మోర్తాడ్‌ జూనియర్‌ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

కేబీఆర్‌ పార్కు వద్ద మల్టీలెవల్‌ పార్కింగ్‌!

- టెండర్‌ దక్కించుకున్న సంస్థ
- త్వరలో నిర్మాణ పనులు
- 70 కార్లకు పార్కింగ్‌ సదుపాయం
- భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్న ప్రజలు


కేబీఆర్‌ పార్కును ఆనుకుని మల్టీలెవల్‌ పార్కింగ్‌ నిర్మాణం చేపట్టనున్న పార్కింగ్‌ స్థలం

బంజారాహిల్స్‌: బంజారాహిల్స్‌లోని ప్రతిష్ఠాత్మక కేబీఆర్‌ పార్కుకు వచ్చే వాకర్లు, సందర్శకుల కోసం మల్టీలెవల్‌ పార్కింగ్‌ సిస్టంను అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించడమే కాకుండా ఇందుకు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్‌ కమిటీ ఆమోదం కూడా తెలిపింది. కార్ల పార్కింగ్‌ సమస్యలకు చెక్‌ పెట్టేందుకు ఈ నిర్మాణం అవసరమని నిర్ణయించి నవ నిర్మాణ్‌ అసోసియేట్స్‌కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ప్రజల నుంచి వస్తున్న డిమాండ్లకు అనుగుణంగా మల్టీలెవల్‌ పార్కింగ్‌ ఏర్పాటు చేసేందుకు జీహెచ్‌ఎంసీ ముందుకు వచ్చింది. 405 చదరపు మీటర్లలో ఈ పార్కింగ్‌ నిర్మాణం చేపట్టనున్నారు. 72 కార్లను పార్కింగ్‌ చేసేందుకు కారు స్పేస్‌లు (ఈసీఎస్‌) కలిగి ఉంటుంది. కేబీఆర్‌ పార్కు మల్టీలెవల్‌ పార్కింగ్‌ సదుపాయంలో మొత్తం ఖాళీల్లో 20 శాతం బైక్‌లకు కేటాయించనున్నారు. ఈ సదుపాయం డిజైన్‌, బిల్డ్‌, ఫైనాన్స్‌, ఆపరేట్‌, ట్రాన్స్‌ఫర్‌ మోడల్‌లో నిర్మించబడుతుంది.

పార్కింగ్‌కు టికెట్లు..

మల్టీలెవల్‌ కారు పార్కింగ్‌ సదుపాయం ఉదయం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. పార్కింగ్‌ కోసం టికెట్‌ తీసుకోవాల్సి ఉంటుంది. మెషన్ల ద్వారా టికెట్లు ఇస్తారు. స్మార్ట్‌కార్డుల ద్వారా కూడా టికెట్‌ పంపిణీ ఉంటుంది. పార్కింగ్‌ సదుపాయాన్ని నావిగేట్‌ చేయడానికి, పార్కింగ్‌ను ముందుగానే బుక్‌ చేసుకోవడానికి, ఇతర సేవల కోసం మొబైల్‌ యాప్‌ను కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

కేబీఆర్‌ పార్కు వద్ద నిర్మించ తలపెట్టిన మల్టీలెవల్‌ కారు పార్కింగ్‌పై వాకర్లు, సందర్శకులు, స్థానిక వ్యాపారులు, ప్రజల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఇక్కడ 40 కార్ల వరకు పార్కింగ్‌ చేసుకునే అవకాశం ఉంది. ఈ మల్టీ లెవల్‌ కారు పార్కింగ్‌ను నిర్మిస్తే 70 కార్లకు మాత్రమే పార్కింగ్‌ సదుపాయం ఉంటుంది. కేవలం 30 కార్లు కోసం ఈ పార్కింగ్‌ సౌకర్యం అవసరమా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. టికెట్లు తీసుకుని పార్కింగ్‌ సౌకర్యం ఏర్పాటు చేస్తే ఏ ఒక్కరూ ముందుకువచ్చే పరిస్థితులు కూడా కనిపించడం లేదు.

భిన్నాభిప్రాయాలు..

ప్రకటనల ద్వారా ఆదాయాన్ని పెంచుకునేందుకే మల్టీలెవల్‌ కారు పార్కింగ్‌ నిర్మాణం చేపట్టబోతున్నార ని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీదైన 500 గజాల స్థలాన్ని కేబీఆర్‌ పార్కు మెయిన్‌ గేటు వద్ద కేటాయించడం వల్ల ఇది పార్కింగ్‌ నిర్వాహకులకు పెద్దగా ఉపయోగపడేది కాదని కూడా విమర్శలు వస్తున్నాయి. కొత్తగా తీసుకువచ్చే పార్కింగ్‌ సిస్టంతో పార్కింగ్‌ చేసేవారికి పెద్దగా ఉపయోగం లేకపోగా కొంతమంది మాత్రం లాభం పొందుతారని, ప్రకటనల దందాతో లబ్ధి పొందుతారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కార్మికుల పక్షపాతి 'కేదారి'


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌

సనత్‌నగర్‌: కార్మికుల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారానికి గంజి కేదారి ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ కొనియాడారు. సనత్‌నగర్‌లోని నెహ్రూనగర్‌ అధ్యక్షుడు కేదారి శనివారం రాత్రి మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదివారం రాజరాజేశ్వరీనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి పార్థివదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ట్రేడ్‌ యూనియన్‌, కాలనీ, పద్మశాలీ సంఘం అధ్యక్షులుగా ఎనలేని సేవలు అందించారని గుర్తు చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్‌ నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్‌టీకాలనీలో అప్ఫాన్‌కు నివాళి..

సనత్‌నగర్‌ ఎస్‌ఆర్‌టీకాలనీకి చెందిన హుస్సేన్‌ కుమారుడు అప్ఫాన్‌ (20) శనివారం సాయంత్రం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ వారి నివాసానికి వెళ్లి మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. తమ కుమారుడు జ్వరంతో బాధపడుతుండడంతో ప్రైవేట్‌ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా చికిత్స ప్రారంభించిన కొద్దిసేపటికే మృతి చెందాడని తండ్రి హుస్సేన్‌ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఎమ్మెల్యే సనత్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. ఆయన వెంట నాయకులు కొలను బాల్‌రెడ్డి, సురేశ్‌గౌడ్‌, రాజేశ్‌, ఖలీల్‌, నోమాన్‌, జమీర్‌ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు


మహేష్‌కుమార్‌గౌడ్‌ను శాలువాతో సన్మానిస్తున్న పాక జ్ఞానేశ్వరి

చిక్కడపల్లి: టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్‌ మహిళా పాక జ్ఞానేశ్వరి, మాజీ మంత్రి షబ్బీర్‌ అలీతో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్‌ పార్టీ అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కోసం కృషి చేస్తుందన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక

ముషీరాబాద్‌: రాంనగర్‌కు చెందిన వైష్ణవి అనే బాలిక 9వ తరగతి చదివి ఇంటిపట్టునే ఉంటోంది. ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ముషీరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించి సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం బాలిక సుల్తాన్‌ బజార్‌లోని తన స్నేహితురాలి ఇంటి వద్ద క్షేమంగా ఉన్నట్లు గుర్తించారు. అక్కడి నుంచి బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్‌ రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు.

పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేయొద్దు

కవాడిగూడ: పోక్సో చట్టాన్ని దుర్వినియోగం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుడు బుర్రా శ్రీనివాస్‌ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌ వద్ద పోక్సో చట్టం దుర్వినియోగం అడ్డుకోవాలని కోరుతూ మహిళలు, చిన్నారులతో కలిసి బుర్రా శ్రీనివాస్‌ నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చిన్నపిల్లలకు ప్రేమ పాఠం చెప్పానని తప్పుడు ఆరోపణలతో ఉపాధ్యాయురాలు కె. జ్యోతిర్మయి, వై. శేషలక్ష్మిలు 2021లో చిక్కడపల్లి పోలీస్‌ స్టేషన్‌లో పోక్సో చట్టం కింద కేసు పెట్టించి తనను జైలుకు పంపారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మహిళలు, చిన్నారులతో పాటు పలువురు పోక్సో చట్టం బాధితులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయ చైర్మన్‌గా సుధాకర్‌గుప్తా


వెనిశెట్టి సుధాకర్‌ గుప్తాను సన్మానిస్తున్న రాంనగర్‌ ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

ముషీరాబాద్‌: ఆలేరు సాయిబాబా ఆలయ చైర్మన్‌గా వెనిశెట్టి సుధాకర్‌గుప్తా ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం పవిత్రానగర్‌లోని రాంనగర్‌ ఆర్య వైశ్య సంఘం కార్యాలయంలో సంఘం సభ్యులు ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రాజశేఖర్‌గుప్తా, సంఘం సభ్యులు లక్ష్మణ్‌గుప్తా, సత్యవర్ధన్‌గుప్తా, కృష్ణమూర్తి గుప్తా, ఆంజనేయులుగుప్తా, నాగేందర్‌గుప్తా పాల్గొన్నారు.

ఘనంగా ఇక్ఫాయ్‌ వ్యవస్థాపక దినోత్సవం


వేడుకల్లో పాల్గొన్న అతిథులు

బంజారాహిల్స్‌: ఇక్ఫాయ్‌ విశ్వ విద్యాలయం 14వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన నారాయణ హృదయాలయ లిమిటెడ్‌ చైర్మన్‌ డాక్టర్‌ దేవీప్రసాద్‌ షెట్టి 'ఆధునిక వైద్య రంగంలో డిజిటల్‌ సేవల పాత్ర' అనే అంశంపై వర్చువల్‌గా ప్రసంగించారు. రానున్న కాలంలో మెరుగైన వైద్యం ప్రజలందరికీ అందుబాటులోకి రానున్నదని, సాంకేతికపరంగా వైద్య రంగంలో అనేక ప్రైవేటు, కార్పొరేట్‌ ఆస్పత్రులు ఆరోగ్య బీమాను సొంతంగా అందజేస్తే ఇది సాధ్యమేనని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రోగులు, ఆస్పత్రులు, బీమా సంస్థలు ఒకరికొకరు నమ్మే పరిస్థితులు లేవని, ఆ పరిస్థితిని నివారించడానికి ఆస్పత్రులు ముందుకు రావలసిన అవసరం ఉన్నదని ఆయన పిలుపునిచ్చారు. బెంగళూరులోని నారాయణ హృదయాలయ ఈ క్రమంలో రోగులకు ఉపయుక్తమైన బీమా పథకాన్ని అందుబాటులోకి తెచ్చిందని చెప్పారు. అదేవిధంగా ప్రజలు తమ వైద్య పరీక్షల వివరాలను తమ మొబైల్‌ ఫోన్‌లలో భద్రపరచుకుని అందుబాటులోకి తెచ్చుకుంటే అత్యవసర పరిస్థితుల్లో మళ్ళీ మళ్ళీ పరీక్షలు రాసే అవసరం రాదని వివరించారు. తద్వారా వైద్యులు సత్వర చికిత్సను అందజేసి రోగుల ఆరోగ్యాన్ని పరీక్షించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయన్నారు. రిజర్వ్‌ బ్యాంక్‌ మాజీ గవర్నర్‌, ఇక్ఫాయ్‌ కులపతి రంగరాజన్‌ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ అందరికీ అందుబాటులో వైద్యం అనేది గురుతర బాధ్యతగా గుర్తించి ప్రజలకు సేవలందించాలన్నార. కార్యక్రమంలో ఉప కులపతి ఎల్‌ఎస్‌ గణేష్‌, విశిష్ట సలహాదారుడు మహేందర్‌రెడ్డి, చైర్‌పర్సన్‌ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్‌: టమాటా రూ.39, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 23, బజ్జీమిర్చి 70, క్యాప్సికం 70, పచ్చకాకర 48, పందిరి బీర 52, క్యాబేజీ 23, క్యారెట్‌ 47, దొండ 45, గుండుబీన్స్‌ 65, గింజ చిక్కుడు 85, గోకరకాయ 40, కీర 25, దోసకాయ 23, బీట్‌రూట్‌ 25, ఉల్లిగడ్డ 50, ఆలుగడ్డ 37, చామగడ్డ 40, మొరంగడ్డ 50, కందగడ్డ 55, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 10, మునగకాయ 5–6, ముల్లంగి 5–6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అందుబాటులో ఉంటాయి.

కూన వెంకటేశ్‌గౌడ్‌ సేవలు మరువలేనివి


చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నీలిమా

సనత్‌నగర్‌: సీనియర్‌ రాజకీయ నేత కూన వెంకటేశ్‌గౌడ్‌ సేవలు మరువలేనివని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్‌ కోట నీలిమా అన్నారు. ఆదివారం జరిగిన వెంకటేశ్‌గౌడ్‌ సంస్మరణ కార్యక్రమానికి ఆమె హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈడబ్ల్యూఎస్‌ స్థలాన్ని పరిరక్షించాలి


ఈడబ్ల్యూఎస్‌ వాసులతో మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్‌: ఎస్‌ఆర్‌నగర్‌ ఈడబ్ల్యూఎస్‌ క్వార్టర్స్‌కు చెందిన దాదాపు 1500 గజాల ఖాళీ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానికులు సనత్‌నగర్‌ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డిని కోరారు. గతంలో ఓ వ్యక్తి ఇది తన భూమి అంటూ స్థానికులను బెదిరింపులకు గురిచేయడంతో పాటు ఫెన్సింగ్‌ ఏర్పాటుకు యత్నించగా అప్పట్లో వారు మర్రి శశిధర్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన అప్పటి కలెక్టర్‌ రాహుల్‌బొజ్జాను కలిసి డాక్యుమెంట్స్‌ను అందించారు. కలెక్టర్‌ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంగా గుర్తించి హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేశారు. అయితే ఈ స్థల వివాదంపై హైకోర్టు కింది కోర్టులో తేల్చుకోవాలని ఆదేశించింది. సదరు ప్రైవేట్‌ వ్యక్తి ఆ స్థలాన్ని ఇతరులకు అమ్మేందుకు యత్నిస్తున్నాడని మరోసారి శశిధర్‌రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన ఆదివారం కాలనీలో పర్యటించారు. స్థలాన్ని పరిరక్షిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, వినోద్‌, శ్రీనివాస్‌, కృష్ణ, నరేందర్‌, రఘునాథ్‌గౌడ్‌, ప్రేమలత, జశ్వంత్‌ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతిచెందాడని..

ఆసుపత్రి ఎదుట కుటుంబసభ్యుల ధర్నా


అఫ్ఫాన్‌ (ఫైల్‌)

సనత్‌నగర్‌: వైద్యుల నిర్లక్ష్యంతోనే తమ కుమారుడు మృతి చెందాడని కుటుంబ సభ్యులు, బస్తీవాసులు సనత్‌నగర్‌లోని రెనోవా నీలిమా ఆస్పత్రి ఎదుట ధర్నాకు దిగారు. సనత్‌నగర్‌ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్‌ ఎస్సార్టీ కాలనీకి చెందిన నాజ్‌రిన్‌ సుల్తానా, హుస్సేన్‌ బిన్‌ మహ్మద్‌ కుమారుడు అఫ్ఫాన్‌ బిన్‌ హుస్సేన్‌ (20) కూకట్‌పల్లిలోని అవినాష్‌ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు అఫ్ఫాన్‌ను శుక్రవారం సనత్‌నగర్‌ జెక్‌కాలనీలోని రెనోవా నీలిమా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. అయితే వైద్యుడు చేసిన ఓవర్‌డోస్‌ ఇంజక్షన్‌ కారణంగా మరణించాడంటూ కుటుంబసభ్యులు, బస్తీవాసులు శనివారం రాత్రి, ఆదివారం ఉదయం ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే మరణించాడంటూ తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు సనత్‌నగర్‌ పోలీసులు కేసు నమోదు చేసి అఫ్ఫాన్‌ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్‌ మృతి

చిక్కడపల్లి: అనారోగ్యంతో ఆటో డ్రైవర్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం రాత్రి ఎస్‌ఐ మౌనిక తెలిపిన తెలిపిన వివరాల ప్రకారం... రాంనగర్‌లోని సన్‌ డిగ్రీ కళాశాల ఎదురుగా హోటల్‌ పక్కన వృద్ధుడు చిన్నరాజు (70) సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అటుగా వస్తున్న బ్లూకోర్ట్స్‌, స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించారు. అతనిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కూడా అక్కడ చేరుకుని వాకబు చేయగా అతనిది కర్ణాటక రాష్ట్రం వృత్తిరీత్యా ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఉండేవడని తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా రాంనగర్‌లోని మోహన్‌నగర్‌లో ఉంటూ జీవిస్తున్నాడు. కాగా చికిత్సపొందుతూ చనిపోయాడని వైద్యులు ధ్రువీకరించారని తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాపు చేస్తున్నారు. గాంధీ మార్చురిలో మృతదేహాన్ని భద్రపరిచినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు చిక్కడపల్లి పోలీసులను సంప్రదించాలని కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



అమీర్‌పేట: అమీర్‌పేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఎస్‌ఆర్‌నగర్‌ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్‌ శ్రీనాథ్‌ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సత్యం థియేటర్‌ నుంచి మైత్రివనంకు వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న బ్లూ ఫాక్స్‌ హోటల్‌ ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరీక్షించగా అప్పటికే చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడి వయస్సు దాదాపు 30 ఏళ్లు ఉంటాయని, రెండు, మూడు రోజులుగా మద్యం సేవిస్తూ హోటల్‌ పరిసర ప్రాంతంలోనే ఉంటున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. సంబంధిత కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.